వైభవంగా కోటదుర్గ శోభాయాత్ర

కోటదుర్గమ్మ శోభాయాత్ర శనివారం రాత్రి అంగరంగ వైభవంగా సాగింది. ఆనవాయితీ ప్రకారం పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ముగింపు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి త్రిశూలానికి పూజలు చేసి ఊరేగింపు ప్రారంభించారు. దుర్గమ్మ ఉత్సవాల్లో ప్రత్యేకతగా నిలిచే బళ్ల వేషాలు ఆకట్టుకున్నాయి. కలశయాత్ర ముందు భాగంలో సాంస్కృతిక ప్రదర్శనలు సాగాయి. – న్యూస్‌టుడే, పాలకొండ, గ్రామీణం



ఆకట్టుకున్న బండ్లవేషాలు



పల్లకిపై అమ్మవారి ఊరేగింపు

ఉత్సవం ఉరిమే ఉత్సాహం

కళారూపాలు.. జానపద నృత్యాలు.. విచిత్ర వేషధారణలు.. వివిధ రకాల అలంకరణలు.. పండ్లు.. పూలు.. ఆహార పదార్థాల ప్రదర్శనలు.. ఒక్కటేమిటి.. చూసేందుకు రెండు కళ్లూ చాలవు.. గజపతుల సామ్రాజ్య వైభవానికి గుర్తుగా.. ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా ప్రారంభమైన ఉత్సవాలతో విజయనగరం ప్రత్యేక శోభను సంతరించుకుంది. ఈ కళల నిలయంలో ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడేలా సంబరాలు అంబరాన్నంటాయి.
– ఈనాడు, విజయనగరం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి, అదితి, కలెక్టర్

పైడితల్లి ఆలయం నుంచి ఉత్సవ ర్యాలీని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉదయం ప్రారంభించారు. వందలాది మందితో వివిధ రకాల ప్రదర్శనల నడుమ కోట, సింహాచలం మేడ, గురజాడ కళాభారతి మీదుగా అయోధ్య మైదానం వరకు సాగింది. ఇందులో 51 కళారూపాలు భాగస్వాములయ్యాయి. కోలాటం, తప్పెటగుళ్లు, థింసా, బిందె, కొమ్ము నృత్యాలు, కర్రసాము, కత్తిసాము, పులివేషాలు, ఒంటెలు, గుర్రాలు, బాక్సింగ్, పులివేషాలు, సాముగారడీలు, చెక్క భజనలు, గంగిరెద్దులు, వెయిట్‌లిఫ్టింగ్, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు సందడి చేశారు.






విజయనగర వైభవ శతకం పుస్తకావిష్కరణ



తప్పెటగుళ్ల సందడి



పూల హంసపై కృష్ణుడు



పిల్లల స్కేటింగ్








పోలవరం నమూనాను తిలకిస్తున్న అశోక్

ఆకట్టుకున్న బెలూన్ షో

రాజీవ్ మైదానంలో వేడి గాలి బెలూన్ షో ఆకట్టుకుంది. నిప్పులు కక్కుతూ గాల్లోకి ఎగరడంతో చూసేందుకు యువతి, యువకులు ఆసక్తి చూపారు. సెట్విజ్ సీఈవో బి.రాంగో పాల్ పర్యవేక్షించారు.









మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు



వావ్.. నృత్యరూపకం

ప్రభుత్వానికి అమ్మవారి ఆశీస్సులు

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి పండగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని ముఖ్య అతిథి శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు అన్నారు. గత ప్రభుత్వ విధానాలతో 20 ఏళ్ల వెనక్కి వెళ్లిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి కూటమి ప్రభుత్వానికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నారు. మూడు రోజుల పండగ వాతావరణంలో కార్యక్రమాలు జరగాలని, భావితరాలకు మన సంప్రదాయాలు తెలిసేలా చేస్తున్నారు. ఇంతటి గౌరవాన్ని ఇచ్చిన మాన్సాస్ ఛైర్మన్, గజపతుల వారసుడు పూసపాటి అశోక్ గజపతి రాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులకు ధన్యవాదాలు తెలిపారు. విజయనగరం అంటే విద్యలనగరమని పేర్కొన్నారు. పీవీజీ రాజు ఆ పేరును తీసుకురాగా.. ద్వారం, గిడుగు, గురజాడ, సాలూరు రాజేశ్వరరావు తదితరులు ఆ ఖ్యాతిని కొనసాగించారన్నారు.



కోటలో ఏర్పాటు చేసిన వీరజవానుల చిత్ర ప్రదర్శన



భువన విజయం ప్రదర్శన

ప్రత్యేక గౌరవం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్సవాలతో విజయనగర గౌరవం, కీర్తి పెంపొందుతాయన్నారు. నగర చరిత్ర, ఖ్యాతిని వివరించేందుకు ఏర్పాటు చేసిన లేజర్‌షో పండగ వాతావరణాన్ని తలపించిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సంస్కృతి, సంప్రదాయాలు, కళల పరిరక్షణకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, అశోక్‌గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ సేథు మాధవన్, ఆర్డీవో కీర్తి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల వేషధారణ



బిందెలతో మహిళల కోలాటం ప్రదర్శన

పల్లెల్లో ప్రగతి పండగ

451 పంచాయతీల్లో రూ.110 కోట్లతో పనులు



ప్రభుత్వం విడుదల చేసిన లోగో

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం నుంచి వారం రోజుల పాటు పల్లెల్లో అభివృద్ధి పనుల జాతర ప్రారంభం కానుంది. 'పల్లె పండగ' పేరుతో 451 పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి యంత్రాంగం సిద్ధమైంది.

గ్రామాలను అనుసంధానిస్తూ బీటీ రహదారులు, పల్లెల్లో సిమెంటు రహదారులు, కాలువలు, గోకులాలు, సాగునీరు అందించేందుకు వీలుగా కందకాలు (ట్రెంచి) తవ్వకాలు చేపడతారు. ప్రజాప్రతినిధులు ఈ పనులను ప్రారంభించే కార్యక్రమంలో పాల్గొంటారు. జిల్లాలో రూ.110 కోట్ల విలువైన పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు. రూ.60 కోట్లతో 313 పనులు పూర్తి చేస్తారు. రహదారి సౌకర్యం లేని గ్రామాలకు కల్పించాలనే లక్ష్యంతో 51 బీటీ రహదారులు మంజూరు చేశారు. 270 గోకులాలు నిర్మించనున్నారు. వీటి కోసం రూ.5 కోట్లు వెచ్చించే వీలుంది. సాగునీరు, జల సంరక్షణ పనులు, ఇంకుడు గుంతలు, పొలాల్లో గుంతలు (పారం పాండ్లు) తవ్వుకునే సౌలభ్యం ఉంది. మండలాల వారీగా ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించనున్నామని డీపీవో కె.రామచంద్రరావు చెప్పారు.

సిండికేట్ల మధ్య పోటాపోటీ

విజయనగరంలో 5,242.. మన్యంలో 1,393 దరఖాస్తులు

ఈనాడు–పార్వతీపురం మన్యం, పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: మద్యం దుకాణం దక్కేది ఎవరికో తేలే రోజు వచ్చేసింది. చివరి మూడు రోజులు అత్యధికంగా దరఖాస్తులు దాఖలయ్యాయి. విజయనగరంలో 153 దుకాణాలకు 5,242, మన్యంలో 52 దుకాణాలకు 1,393 వచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఆరు సిండికేట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఆది నుంచి వీరు వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ఎవరు.. ఎక్కడ.. ఎన్ని దరఖాస్తులు వేస్తోందీ సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

విజయనగరం జిల్లాలో సుమారు 67 దుకాణాలు, మన్యంలో 26 దుకాణాలపై కన్నేశారు. ఒక్కో దానికి అయిదు నుంచి 15కు పైగా ఇచ్చారు. ఒకరిద్దరు సిండికేట్లు వ్యూహాత్మకంగా విజయనగరం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో దరఖాస్తులు తగ్గించి సాలూరు, వీరఘట్టం, సీతానగరం మండలాలపై ఎక్కువ గురిపెట్టారు. విజయనగరం జిల్లాలో ఒక సిండికేట్ 250కి పైగా.. మరో సిండికేట్ 630కి పైగా దరఖాస్తులిచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆరు సిండికేట్ల తరఫున 2,600 దరఖాస్తులకు పైగా దాఖలైనట్లు సమాచారం.



మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ రామచంద్రరావు, ఏఈఎస్ జీవన్

ఉత్తరాంధ్రలో అగ్రస్థానం

మద్యం దుకాణాలకు దాఖలైన దరఖాస్తుల్లో విజయనగరం జిల్లా రాష్ట్రంలో తృతీయ స్థానం, ఉత్తరాంధ్ర జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. దీని వల్ల సర్కారుకు దండిగానే ఆదాయం వచ్చింది. దరఖాస్తుల్లో నెలిమర్ల నియోజకవర్గం ముందంజలో.. ఎస్.కోట వెనుకంజలో ఉన్నాయి. జిల్లా సగటు దరఖాస్తులు 34.26 కాగా నెల్లిమర్ల పరిధిలోని దుకాణానికి అత్యధికంగా 68 అందాయి. ఎస్.కోటలో 142, 143 నంబరు దుకాణాలకు 20 దాఖలయ్యాయి. మన్యంలో సాలూరు నియోజకవర్గం ముందంజలో ఉండగా కురుపాం వెనుకబడింది. సగటున 26.46 దరఖాస్తులు దాఖలయ్యాయి. వీరఘట్టంలోని రెండు దుకాణాలకు అత్యధికంగా 65, సీతంపేటలోని రెండింటికి అత్యల్పంగా 17 వచ్చాయి. ఉభయ జిల్లాలో దరఖాస్తుల ద్వారా విజయనగరం జిల్లా నుంచి రూ.104.84 కోట్లు.. మన్యం జిల్లా నుంచి రూ.27.86 కోట్లు ప్రభుత్వానికి జమైంది.

బందోబస్తు కోరాం

లాటరీ తీసే నాయుడు ఫంక్షను హాలు వద్ద ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ఎక్సైజ్ సహాయ కమిషనరు రామచంద్రరావు చెప్పారు. సుమారు వెయ్యి మంది హాజరవుతారని భావిస్తున్నామని, అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. లాటరీ ప్రక్రియను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ప్రారంభిస్తారని చెప్పారు.

అతిథులకు ఏమైంది?

ముందుగానే వెళ్లిపోయిన సైబీరియా పక్షులు



ఒకప్పుడు చెట్లపై సందడి ఇలా..

సీతానగరం, న్యూస్‌టుడే: ఏటా ఆరు నెలల పాటు కనువిందు చేసే సైబీరియా పక్షులు ఒక్కసారిగా వెళ్లిపోవడంతో సీతానగరం మండలంలోని చెల్లంనాయుడువలస గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్‌లో ఇవి గ్రామానికి చేరుకుంటాయి. వీటి రాక రుతు పవనాలను సూచించడంతో వర్షాలు కురుస్తాయని ప్రజలు ఆశగా ఎదురు చూస్తారు. తమ అతిథులుగా భావిస్తారు. వచ్చిన తర్వాత సువర్ణముఖి నదీతీరం, పరిసర పొలాల్లో ఆహారం సేకరించి ఆరు నెలలు ఉంటాయి. మగవి ఆహార సేకరణలో ఉంటే, ఆడ పక్షులు గూళ్లను కడతాయి. గుడ్లు పెట్టి, పొదిగి, పిల్లలకు రెక్కలొచ్చాక స్వదేశానికి వెళ్లిపోతాయి. కార్తికంలో పురాణం విన్న తర్వాత అతిథులు గ్రామం విడిచి వెళ్తాయని గ్రామస్థుల నమ్మకం. ఏటా ఇలానే జరిగేది. కానీ ఈ సారి రెండు నెలల ముందుగానే ఎందుకు వెళ్లిపోయాయని స్థానికంగా చర్చించుకుంటున్నారు.



చెల్లంనాయుడువలస సమీపంలో బోసిపోయిన చింత చెట్టు

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి గయాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. వసతి, భోజన సదుపాయంతో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. అర్హులైన ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు ఈ నెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5 లక్షల్లోపు ఉండాలని తెలిపారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	142	254	264



కాంతులీనుతున్న వనంగుడి

సిరులతల్లి.. ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి జాతర నేడు ప్రారంభం కానుంది. తొలి రోజు సోమవారం రాత్రి తొలేళ్లు జరగనున్నాయి. మంగళవారం సిరిమానోత్సవం సాగనుంది. రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడంతో అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆదివారం భక్తులు దర్శనాలకు తరలివచ్చారు. నగరంలోని పలు ప్రాంతాల వారు ఘటాలతో మొక్కులు చెల్లించారు.
- న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్, మయూరికూడలి, ఉడాకాలనీ, పట్టణం, గ్రామీణం, కంటోన్మెంట్, రింగురోడ్డు, అయ్యన్నపేట, కోట



సాహిత్య నిలయం.. ఆధ్యాత్మిక సంబరం

- నేడు పైడితల్లి తొలేళ్లు
- పూర్తయిన ఏర్పాట్లు

పైడిమాంబను దర్శించిన ప్రముఖులు

అమ్మవారిని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు దర్శించుకున్నారు. ఆలయ వేదపండితులు, అధికారులు వారికి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు, ఆశీర్వచనాల అనంతరం తల్లి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. మంత్రి కొండపల్లి, ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి, గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



తల్లి సేవలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలు అదితి, గొండు శంకర్




స్పీకర్‌కు చిత్రపటాన్ని ఇస్తున్న మంత్రి శ్రీనివాస్



ఎమ్మెల్యే కళా వెంకటరావుకు అందజేస్తున్న ఆలయ ఈవో, సిరిమాను పూజారి తదితరులు

నగరంలోని శివాలయంవీధికి చెందిన చిలకలపూడి పైడిరాజు ఐసు పుల్లలతో సిరిమాను ఆకృతి తయారు చేశారు. రూ.50 ఖర్చుతో 6 ఇంచీల ఎత్తులో రథాన్ని సిద్ధం చేశారు. గత 30 ఏళ్లగా వివిధ రకాల వస్తువులతో చేస్తున్నానని చెప్పారు.
– న్యూస్‌టుడే, కంటోన్మెంట్





మూడులాంతర్లు సమీపంలో బారికేడ్ల ఏర్పాటు

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే రోడ్లకు మరమ్మతులు చేశారు. హుకుంపేట నుంచి సిరిమాను రథం బయలు దేరే పుత్సల వీధి నుంచి కాళ్ల నాయుడు మందిరం వరకు రూ.12.40 లక్షలతో బీటీ రోడ్డు వేశారు. ట్రాఫిక్ ఐల్యాండ్‌లతో పాటు ప్రధాన కూడళ్లు, రోడ్లు, సెంటర్ డివైడర్లు, ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

నిరంతర తాగునీటి సరఫరా

పండగ రెండు రోజుల్లోనూ తాగునీరు సరఫరా చేయనున్నారు. ఇప్పటికే 1000 కిలో లీటర్ల లిక్విడ్ క్లోరిన్- బ్లీచింగ్‌ను సిద్ధం చేశారు. సోమ, మంగళవారాల్లో భక్తుల సౌకర్యార్థం 20 ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. అమ్మవారి కోవెల, గంటస్తంభం, కోట కూడలి, అయోధ్య మైదానం, పాత బస్టాండ్, సింహాచలం మేడ, బాలాజీ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ రోడ్, ఐస్‌ఫ్యాక్టరీ కూడలి, గురజాడ అప్పారావు విగ్రహం దగ్గర, దాసన్నపేట రైతు బజారు, సీఎంఆర్ కూడలి, రామారాయుడు కూడలి, కొత్తపేట నీళ్ల ట్యాంకు, అంబటిసత్రం కూడలి, ఎత్తుబ్రిడ్జి, బాలాజీ నీళ్లట్యాంకు, ఆర్ అండ్‌బీ కూడలి, నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద పెట్టనున్నారు.

120 బయో మరుగుదొడ్లు..

నగరపాలిక పరిధిలో 120 వరకు బయో మరుగుదొడ్లు పెడుతున్నారు. ఉత్సవాలు జరిగే వేదికలతో పాటు జాతరకు సంబంధించిన ప్రధాన కేంద్రాల వద్ద అందుబాటులో ఉండనున్నాయి. పారిశుద్ధ్య పనులకు అదనంగా 330 మందిని నియమించారు. వీరంతా మూడు షిఫ్టుల్లో పనిచేయనున్నారు. వీరు కాకుండా అదనంగా మరో 100 మంది విధుల్లో ఉండనున్నారు. వారంతా ఏకరూపు దుస్తులు ధరిస్తారు. ప్రస్తుతమున్న 620 మంది ప్రత్యక్షంగా పనులు చేయనున్నారని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. ఏకంగా రూ.1.30 కోట్ల మేర ఖర్చు పెడుతున్నామని వెల్లడించారు.

సిరిమాను మార్గంలో 80 సీసీ కెమెరాలు

నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: సిరిమానోత్సవంలో భాగంగా 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పోలీసు కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. బందోబస్తులో ఉన్న పోలీసులకు బాడీ వార్న్ కెమెరాలను కూడా ఇస్తామన్నారు. ఇద్దరు అదనపు ఎస్పీలు, 11 మంది డీఎస్పీలు, 61 మంది సీఐలు, ఆర్ఐలు, 147 మంది ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, 17 మంది మహిళా ఎస్సైలు, 425 మంది ఏఎస్ఐలు, హెచ్‌సీలు, హెడ్ కానిస్టేబుళ్లు, 136 మంది మహిళా కానిస్టేబుళ్లు, 369 మంది హోంగార్డులు, 200 మంది ఏఆర్ సిబ్బంది విధుల్లో ఉంటారని చెప్పారు. జిల్లాతో పాటు పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి రానున్నారన్నారు.

ప్రత్యేక బృందాలు..

ఆలయం ఎదురుగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు ● నేరాల నియంత్రణకు ప్రత్యేకంగా 44 మంది పోలీసు అధికారుల ఆధ్వర్యంలో 20 బృందాలు పనిచేస్తాయన్నారు. 40 మందితో 4 క్విక్ రియాక్షన్ టీమ్స్‌ను సిద్ధం చేశామని వెల్లడించారు. భక్తులకు, సహాయ, సహకారాలు అందించేందుకు 25 మందితో సేవాదళ్ ఉంటుందని, ఈవ్ టీజింగ్ చేసే ఆకతాయిలను గుర్తించేందుకు 24 మందితో షీ- టీమ్స్ తిరుగుతాయన్నారు.

రాకపోకలు నిషేధం..

సిరిమానోత్సవం రోజున ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు బాలాజీ కూడలి, సింహాచలం మేడ, కోట, గంటస్తంభం, ఎంఆర్ కళాశాల, గురజాడ కూడలి, కన్యకా పరమేశ్వరి కోవెల, గంటస్తంభం, ట్యాక్సీ స్టాండ్, ఎంజీ రోడ్డు, గుమ్చీ తదితర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నిషేధిస్తామన్నారు. భక్తులంతా ప్రశాంత వాతావరణంలో దర్శనాలు చేసుకుని, ఇళ్లకు వెళ్లాలని కోరారు.



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్





చరిత్రను తెలిపే లేజర్ షో

విజయనగరం సంస్కృతి, గజపతుల చరిత్రను తెలియజేసేలా కోట వద్ద లేజర్ షోను ఏర్పాటు చేశారు. మంత్రి కొండపల్లి ప్రారంభించారు. మూడ్రోజుల పాటు కొనసాగనుందని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. 250 ఏళ్ల నాటి చరిత్రను ప్రదర్శిస్తున్నామన్నారు. పైడిమాంబ దేవిలో లీనమవడం, సిరిమానోత్సవ సంబరం, వనంగుడి, చదురుగుడి, గజపతిరాజుల పాలన తదితరాలను తెలియజేస్తున్నట్లు చెప్పారు. మాన్సాస్ ఛైర్మన్ అశోక్ గజపతిరాజు, అదితి గజపతిరాజు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పీవీజీ.రాజు చిత్రం



తిలకిస్తున్న గజపతిరాజు కుటుంబ సభ్యులు, కలెక్టర్ తదితరులు

బాధితుడికి రూ.1,11,500 ఆర్థిక సాయం

పాచిపెంట, న్యూస్‌టుడే: కొత్తవలసకు చెందిన జి.హరనాథ్ కుటుంబానికి గ్రామస్థులు రూ.1,11,500 ఆర్థిక సాయం చేశారు. మెకానిక్‌గా పనిచేస్తున్న ఆయనకు కొన్ని నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెన్నెముక దెబ్బతింది. శస్త్రచికిత్స చేసినప్పటికీ నడవలేని పరిస్థితి నెలకొంది. దీంతో స్థానికులు విరాళాలు సేకరించి దసరా నాడు ఆయన తల్లి విజయమ్మకు నగదు అందజేశారు.



నగదు ఇస్తున్న గ్రామస్థులు

పారదర్శకంగా దుకాణాల లాటరీ ప్రక్రియ

విజయనగరం, ఈనాడు: మద్యం దుకాణాలకు సోమవారం చేపట్టే లాటరీ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే ఈ ప్రక్రియలో లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆదివారం సంబంధిత ఏర్పాట్లను పరిశీలించారు. మూడు విడతలుగా నిర్వహించనున్నట్లు అబ్కారీ శాఖ ఉప కమిషనర్ కె.వి.వి.ఎన్.బాబ్జీరావు, సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు వివరించారు. తొలి విడతలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు 50 దుకాణాలకు. రెండో విడతలో 10- 12 గంటల వరకు 51- 100 దుకాణాలకు.. మూడో విడతలో మధ్యాహ్నం 12 నుంచి 101- 153 దుకాణాలకు లాటరీ తీసి కేటాయిస్తామన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



వరలక్ష్మి (పాతచిత్రం)

బొబ్బిలి, న్యూస్‌టుడే: లారీని తప్పించబోయిన కారు చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా.. ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకెళితే.. బొబ్బిలికి చెందిన ఆర్.వరలక్ష్మి(59) తన కుమారులతో కలిసి కారులో శనివారం రాత్రి ములుగు నుంచి భీమవరం వెళ్తుండగా.. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల వద్ద ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో వరలక్ష్మి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. కుమారులు రామకృష్ణనాయుడు, గణపతినాయుడు గాయపడ్డారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రంలో యువకుడి గల్లంతు



అచ్యుతరావు

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: దేవీ నిమజ్జనానికి వెళ్లిన ఓ యువకుడు సముద్రంలో గల్లంతవడంతో బాధిత కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గరివిడి మండలం దుమ్మెద గ్రామానికి చెందిన వై.అచ్యుతరావు(25)తో పాటు గ్రామంలోని పలువురు యువకులు చింతపల్లి వద్దగల సముద్రతీరానికి వచ్చారు. విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలలకు అచ్యుతరావు లోపలికి కొట్టుకుపోయాడు. స్థానికుల సహకారంతో ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టినా రాత్రి సమయం కావడంతో నిలిపి వేశారు. గతేడాది స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎంటీఎస్)కు ఎంపికై ఉద్యోగంలో చేరాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. అతనికి తల్లిదండ్రులు రామునాయుడు, ఈశ్వరమ్మ, సోదరి సునీత ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

విధుల్లో కానిస్టేబుల్ దుర్మరణం



మల్లేశ్వరరావు (పాతచిత్రం)

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ రైలు ప్రమాదంలో మృతి చెందిన ఘటన పార్వతీపురంలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై బాలాజీరావు వివరాల మేరకు.. జియ్యమ్మవలస మండలంలోని తుంబలి గ్రామానికి చెందిన జి.మల్లేశ్వరరావు(37) పార్వతీపురం పట్టణ స్టేషన్‌లో పని చేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి తాగేవారిని పట్టుకునే క్రమంలో తనిఖీల నిమిత్తం శుక్రవారం పట్టణ శివారుకు వెళ్లారు. అక్కడ పట్టాలు దాటుతుండగా రాయగడ నుంచి విశాఖ వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టడంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. మల్లేశ్వరరావు గతంలో గుమ్మలక్ష్మీపురం పరిధిలో పనిచేయగా ఇటీవల పార్వతీపురం స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఘటనా స్థలాన్ని పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారని ఎస్సై తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

డి.నెలివాడలో నగదు, బంగారం చోరీ

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: మండలంలో డి.నెలివాడలో శనివారం రాత్రి డి.ఉమామహేష్ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. దసరా నేపథ్యంలో రామతీర్థంలోని అత్తవారి ఇంటికి భార్య రాజ్యలక్ష్మితో కలిసి ఆయన వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో కిటికీ అద్దాలు పగలుగొట్టిన దుండగులు బీరువాలోని రూ.లక్ష నగదు, తులం పావు బంగారు అభరణాలు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చిన బాధితులు తలుపులు తీసేసరికే కిటికీ అద్దాలు పగిలి ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీం, పోలీసులు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశామని ఎస్సై గణేష్ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

గండేపల్లి: సాధారణ ప్రయాణికుల్లా ఆటోలు, బస్సులు ఎక్కి.. పక్కనున్న వారిని ఆదమరిచేలా చేస్తారు. అనంతరం బంగారు ఆభరణాలు, నగదు, చరవాణులు, విలువైన వస్తువులు దోచుకుంటారు. ఇలాంటి చోరీల్లో ఆ మహిళలు ఆరితేరితే వారికి సహాయకుడిగా మరో వ్యక్తి ఉన్నారు. ఎట్టకేలకు కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలో చోరీ చేస్తూ దొరికిపోయారు. వీరిలో విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన జి.రేవతి కూడా ఉంది. ఈమేరకు ఆమెను అరెస్టు చేశారు.

అనారోగ్యంతో రైతు ఆత్మహత్య

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: అనారోగ్యం కారణంగా ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎస్.కోట మండలంలో జరిగింది. సీఐ నారాయణమూర్తి వివరాల ప్రకారం పెదఖండేపల్లికి చెందిన పి.రాంబాబు(55) కొన్నేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గడ్డి మందు తాగేశారు. కుటుంబ సభ్యులు చూసి చికిత్స నిమిత్తం విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయన కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ప్రసాదరావు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత బలవన్మరణం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: కడుపు నొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విభీషణరావు తెలిపారు. పూసపాటిరేగ మండలం కొవ్వాడకు చెందిన లంకా అప్పలనాయుడు నక్కపల్లిలోని ఓ పరిశ్రమలో పనిచేస్తూ, భార్య మౌనిక(26)తో కలిసి తిమ్మాపురంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం మౌనికకు కడుపునొప్పి తీవ్రమై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పుడే విధుల నుంచి ఇంటికి వచ్చిన అప్పలనాయుడు వెంటనే అడ్డురోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి తునికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తహసీల్దారు రమేష్‌బాబు సమక్షంలో పంచనామా నిర్వహించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.



గుంటూరు జిల్లా మంగళగిరిలో 'ప్రైడ్ ఆఫ్ మంగళగిరి' పేరుతో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ లీగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు సత్తా చాటారు. మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఫైనల్స్‌లో కృష్ణ జట్టుపై జయ కేతనం ఎగుర వేసి ట్రోఫీతో పాటు రూ.లక్ష నగదు అందుకున్నారు.
– న్యూస్‌టుడే, మంగళగిరి, విజయనగరం క్రీడా విభాగం

జాతీయస్థాయి పోటీలకు అథ్లెట్లు


క్రీడావిభాగం, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి 8 మంది ఎంపికయ్యారు. ట్రిపుల్ జంప్‌లో పాల్‌కుమార్, లాంగ్ జంప్‌లో నీలిమ, 1000 మీటర్ల పరుగులో భార్గవి, 100, 200 మీటర్ల పరుగులో వసంత, 400 మీటర్ల విభాగంలో బి.శ్రావణి, 1000 మీటర్లలో ఎం.హరీష్, 3000 వాక్‌లో బి.హరీష్, లాంగ్ జంప్‌లో భార్గవి ఎంపికైనట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. వీరిని జేసీ సేధు మాధవన్, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు అభినందించారు.

ఉత్సాహంగా విజయనగరం క్రీడలు

క్రీడావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం విజ్జీ మైదానంలో క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు హాజరై నిర్వాహకులు, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, స్కేటింగ్ విభాగాల్లో పలువురు సత్తా చాటారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులలో సరదాగా ఆడుతూ అలరించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ అంబేడ్కర్, అవనాపు విజయ్, డీఎస్‌డీవో ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి కొండపల్లి తదితరులు



కబడ్డీ పోరులో క్రీడాకారిణులు

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? పెద్దగెడ్డ ప్రధాన కాలువ సమీపంలో విద్యుత్తు స్తంభానికి లతలు అల్లుకున్నాయి.
– **ఆయకట్టు రైతులు**

● రైతులకు ఇబ్బంది లేకుండా లతలు తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.
– **సింహాచలం, జేఈ** – **పాచిపెంట**

? శివరాంపురంలో కుళాయి నీరు కలుషితం అవుతున్నాయి దుర్వాసన వస్తోంది. ఇబ్బందులు పడుతున్నాం. – **గ్రామస్థులు**

● నదిలో కలుషిత రావడంతో సమస్య ఏర్పడింది. నీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేస్తాం.
– **క్రాంతికుమార్, పంచాయతీ కార్యదర్శి**
– న్యూస్‌టుడే, బలిజిపేట గ్రామీణం



? బలిజిపేట- పెదపెంకి మార్గంలో వెంగాపురం మలుపులో ఏర్పాటు చేసిన ప్రమాద సూచిక బోర్డు విరిగిపోయింది. – **కిరణ్**

● పరిశీలించి కొత్తవి ఏర్పాటు చేస్తాం.
– **జయరాజ్, జేఈ, ర.భ.శాఖ**
– న్యూస్‌టుడే, బలిజిపేట

? పాలకొండ ఎన్‌కే రాజపురం కూడలిలో చెత్తపోగులు పడిఉన్నాయి. – **శ్రీను**

● చెత్త తొలగించి సమస్య పరిష్కరిస్తాం.
– **దేవీవరప్రసాద్, ఏఈ**
– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

లతల తొలగింపు

స్పందనకు వందనం

సీతానగరం, న్యూస్‌టుడే: మండలంలోని సూరంపేటలో విద్యుత్తు నియంత్రికను లతలు అల్లుకున్నాయి. తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈ నెల 9న ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు స్థానికులు తెలిపారు. వార్త ప్రచురించగా.. విద్యుత్తు శాఖ ఏఈ జగన్‌మోహనరావు స్పందించారు. సిబ్బందితో లతలను తొలగించివేశారు.

రూ.58 కోట్లు.. ఎదురుచూపులు



పాలకొండలో ఇంటింటా తాగునీరు అందించేందుకు కేంద్రం గతంలో రూ.58 కోట్లు మంజూరు చేసింది. మూడేళ్ల క్రితం పైపులు సరఫరా చేశారు. గత వైకాపా హయాంలో పనులు ప్రారంభించి ఆదిలోనే నిలిపివేశారు. దీంతో జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో ఇలా వృథాగా పడిఉన్నాయి. పనులు పూర్తయి ఉంటే పట్టణ ప్రజలకు వేసవిలోనూ తాగునీటి కష్టాలు ఉండవు. తిరిగి పనులు ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాల్సిఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు.
– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

కర్రలే దిక్కు.. తప్పని చిక్కు



కురుపాం మండలం ధర్మలక్ష్మీపురంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల చుట్టూ గతంలో ఐటీడీఏ, ఉపాధి హామీ నిధులతో ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. సగం పనులు జరిగాక వైకాపా అధికారంలోకి వచ్చింది. గుత్తేదారుకు బిల్లులు చెల్లించక పనులు ఆగాయి. చివరికి ఉపాధ్యాయులు ఇలా కర్రలతో కంచె ఏర్పాటు చేశారు. ఇక్కడ 3 నుంచి 10వ తరగతి వరకు 460 మంది చదువుతున్నారు. విషయం ఏటీడబ్ల్యూవో చంద్రబాబును వివరణ కోరగా రక్షణ గోడ నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు విడుదలైతే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

తవ్వకాలపై సంఘటిత పోరాటం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బడిదేవర కొండపై గ్రానైట్ అనుమతులు రద్దు చేయాలని కోరుతున్న సంఘాలన్నీ సంఘటిత పోరాటానికి సిద్ధమవ్వాలని గిరిజన సంక్షేమ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పార్వతీపురంలో విలేకర్లతో మాట్లాడారు. కొండను పరిసరాల్లోని 10 గ్రామాల ప్రజలు ఆరాధ్య దైవంగా కొలుస్తారని తెలిపారు. దీనిపై పడిన వర్షంతో కిందనున్న గ్రామాల్లోని చెరువులు నిండుతాయని, పంటలకు పుష్కలంగా నీరు చేరుతాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇక్కడ తవ్వకాలు రద్దు చేయాలని కోరారు. 2016లో తవ్వకాలు చేపట్టిన సమయంలో ఐక్యంగా పోరాటం చేశామని, మరోసారి అందరూ కలిసి రావాలన్నారు.

మురుగు ముంచేస్తోంది!

పార్వతీపురంను వీడని సమస్య



కొత్తవలస ఏడో వార్డు నందమూరి కాలనీలో వాడుక నీరు రోడ్డుపైకి చేరుతోంది. కాలువలు అధ్వానంగా మారడంతో మురుగు నిలిచి దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.



ఇది రామానందనగర్ కాలనీ శివారు వీధి. ఏళ్లుగా సరైన కాలువ లేకపోవడంతో వాడక నీరు ఇళ్ల ముందే నిల్వ ఉంటోంది. చేసేది లేక ఇంటి యజమానులే శుభ్రత పనులు చేసుకుంటున్నారు.

పార్వతీపురం పట్టణం, బెలగాం, న్యూస్‌టుడే: రెండు వందల ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన పార్వతీపురం పట్టణంలో ఇప్పటికీ మురుగు సమస్యకు పరిష్కారం చూపలేకపోయారు. జిల్లా కేంద్రంగా మారి రెండున్నరేళ్లకు పైగా అవుతున్నా సరైన కాలువలు లేక వాడుక నీరు రోడ్లపైనే పారుతోంది. చేసిది లేక యజమానులే మురుగును ఇళ్ల ముందు నుంచి ఇతర కాలువల్లోకి మళ్లించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఏ గ్రేడు అయినప్పటికీ..

పార్వతీపురం పురపాలక సంఘంలో 30 వార్డులు ఉన్నాయి. 18 వేలు వరకు కుటుంబాలు, 62 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. వీరిని అనేక సమస్యలు వేధిస్తున్నాయి. ఏడాది పాటు సక్రమంగా తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మురుగు ఇళ్ల ముందు నుంచి కదలక అవస్థలు ఎదురవుతున్నాయి. ఏ గ్రేడ్ పురపాలక సంఘంగా ఉన్నప్పటికీ పలు ప్రాంతాల్లో కాలువలు లేవు. ఉన్న చోట నిర్వహణకు దూరమై కనిపిస్తున్నాయి. దీంతో దుర్గంధం వ్యాపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ వీధుల్లోకి వెళ్లలేం..

పట్టణంలోని శివారు కాలనీల్లో కాలువలు మరింత అస్తవ్యస్తంగా మారాయి. బంగారమ్మకాలనీ, బైపాసు కాలనీ, గూడ్స్‌షెడ్ రోడ్డు కాలనీ, జనశక్తి కాలనీ, బెలగాం, గంటా వీధి, కృష్ణపల్లి వెళ్లే మార్గం, జగన్నాథపురం, కొత్తబెలగాం సాయినగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా తయారైంది. కొత్తవలస శివారులో కొత్తపోలమ్మ కాలనీలో నిత్యం ప్రధాన రహదారిపైనే మురుగు పారుతుంది. పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలో దోమల వ్యాప్తికి కాలువలే ప్రధాన కారణమని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం హయాంలోనైనా బాగు చేయాలని కోరుతున్నారు.

ప్రత్యేక దృష్టిసారిస్తాం..

చెత్త సేకరణతో పాటు కాలువల్లో మురుగు తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఎక్కడైనా నీరు నిల్వ చేరితే చర్యలు తీసుకుంటున్నాం. మురుగు సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరమైన చోట కాలువల నిర్మాణం చేపడతాం.
– పకీరురాజు, శానిటరీ ఇన్‌స్పెక్టరు, పార్వతీపురం

సాగునీరు శివారుకు చేరేనా..?



కాలువ పొడవునా పేరుకుపోయిన పూడిక, తుప్పలు

పాచిపెంట, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దగెడ్డ జలాశయం ప్రధాన కాలువలో సాగు నీరు సక్రమంగా ప్రవహించడం లేదు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కాలువల్లో పూడిక తొలగించలేదు. దీంతో పనికిరాని మొక్కలు, నాచు పెరగడంతో నీరు ముందుకు కదలట్లేదు. ఈ కాలువ పరిధిలో పాచిపెంట, రామభద్రపురం మండలంలోని బుసాయివలస వరకు 18 కి.మీ పొడవున 7,500 ఎకరాల్లో పంట సాగవుతోంది. నీరందక పొట్ట దశలోనే ఎండిపోతోంది. దీంతో చేసేది లేక ఇటీవల రామభద్రపురం మండలం జన్నివలసకు చెందిన 30 మంది రైతులు శ్రమదానం చేశారు. ప్రధాన కాలువలో పలుచోట్ల పూడిక, నాచు తొలగింపు పనులు చేపట్టారు. పూర్తిస్థాయిలో పొలాలకు నీరందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై జేఈ రవికుమార్ మాట్లాడుతూ.. రూ.33 లక్షలతో ప్రతిపాదనలు పంపించామని, నిధులు విడుదలయ్యాక పనులు చేపడతామని తెలియజేశారు.

మద్దతు ధర పెంచాలి

బలిజిపేట, న్యూస్‌టుడే: వరి పంటకు కనీస మద్దతు ధర పెంచాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి వై.మన్మథరావు కోరారు. అంపావల్లిలో ఆదివారం నాయకులతో మహాసభ నిర్వహించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ పతాకం ఆవిష్కరించారు.

అతిసారంతో మరొకరి మృతి

పాచిపెంట, న్యూస్‌టుడే: మండలంలో అతిసారం బారిన పడి మృతిచెందిన వారి సంఖ్య మూడుకు చేరింది. విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ విశ్వనాథపురం గ్రామానికి చెందిన కె.సత్యవతి మరణించారు. అతిసార లక్షణాలతో ఈ నెల 3న సాలూరు ప్రాంతీయాసుపత్రిలో చేరారు. అక్కడి నుంచి విజయనగరం తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆమె శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్నారని ఆసుపత్రి నుంచి వచ్చిన ధ్రువపత్రంలో పేర్కొన్నట్లు ప్రోగ్రాం అధికారి రఘుకుమార్ తెలిపారు.

ధరలు తగ్గించాలని నిరసన

కొమరాడ, న్యూస్‌టుడే: నిత్యావసరాల ధరలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం కొమరాడలో నిరసన తెలిపారు. కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యులపై ఆర్థిక భారం పడుతోందన్నారు. రైతుబజార్లలో రాయితీపై ఇస్తున్నా గ్రామస్థాయిలో అందడం లేదన్నారు.

జగన్మాతా పాహిమాం

దసరా ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. శరన్నవరాత్రి ముగింపు సందర్భంగా అమ్మవారి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. దసరా రోజు వాహనాలు, ఆయుధాలకు పూజలు నిర్వహించారు. ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు మొక్కులు చెల్లించి పూజలు చేశారు.
– న్యూస్‌టుడే, బృందం



గూడ్స్‌షెడ్ రోడ్డులో అమ్మవారికి పూజలు



వెంకంపేటలో సామూహిక పూజలు



లుంబేసులో పాలజంగిడి మోస్తున్న జగదీశ్వరి



కురుపాం కోటలో ఆయుధపూజ



సాలూరులో దసరా పూజలకు వరుస కట్టిన లారీలు



పాలకొండ కోటదుర్గమ్మ శోభాయాత్రలో మహిళల కోలాట ప్రదర్శన



పార్వతీపురంలో భవానీమాతకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



పాలకొండలో నవదుర్గల ఊరేగింపు

క్రికెట్ టోర్నీ విజేత పాలకొండ



బహుమతి తీసుకుంటున్న క్రీడాకారులు

పాలకొండ, న్యూస్‌టుడే: దసరా పర్వదినం సందర్భంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో పాలకొండ జట్టు విజేతగా నిలిచింది. ఆదివార పాలకొండ- వీరఘట్టం జట్లు తలపడగా పాలకొండ విజయం సాధించింది. విజేతలకు కడప ఫారెస్ట్‌రేంజ్ అధికారి టి.రాజశేఖర్, ఉద్యోగ సంఘ నాయకుడు ఎన్.భరత్‌భూషణ్ బహుమతులు అందించారు.

ఆత్మీయ కలయిక



జియ్యమ్మవలస మండలంలోని పెదమేరంగి జడ్పీ పాఠశాలలో 2012-13లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా పాఠశాలకు చేరుకొని ఆనందంగా గడిపారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు.
– న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

జియ్యమ్మవలసకు ఏమైంది..!

● శాఖల్లో కనిపించని అధికారులు ● ప్రజలకు తప్పని ఇబ్బందులు



జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: ఎక్కడైనా అభివృద్ధి జరగాలంటే అధికారుల పర్యవేక్షణ అవసరం. కానీ జియ్యమ్మవలస మండలంలో పరిస్థితి భిన్నంగా ఉంది. పలు ప్రభుత్వ శాఖల్లో అధికారులు కానరావడం లేదు. ఎక్కువగా ఇన్‌ఛార్జుల పాలనలోనే ఉన్నాయి. మండలంలో 31 పంచాయతీలు, 25 సచివాలయాలు, 109 గ్రామాలు ఉన్నాయి.

బయట నుంచి సిబ్బంది..

ఏటా ఖరీఫ్‌లో 17 వేల ఎకరాలకు సాగునీరు అందించే వట్టిగెడ్డ జలాశయం ఏఈ వినయ్‌కుమార్ బదిలీపై వెళ్లిపోయారు. ఇక్కడ లస్కర్లు, మజ్దూర్లు లేక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసర సమయాల్లో షట్టర్లు ఎత్తే సిబ్బందిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్నారు. ● చినమేరంగి, జియ్యమ్మవలస బీసీ వసతి గృహాలకు ఒక్కరే సంరక్షకుడు ఉన్నారు. ● సచివాలయాలు, వైద్య, ఆరోగ్యశాఖల్లోనూ ఖాళీలున్నాయి. ఆయా పోస్టులు భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

16 మంది వీఆర్వోలు..

31 పంచాయతీల్లో 16 మంది వీఆర్వోలు మాత్రమే విధుల్లో ఉన్నారు. వీరే మిగిలిన చోట్ల పనులు చేస్తూ నెట్టుకొస్తున్నారు. ● ఎంపీడీవో పి.శ్రీనివాసరావు బదిలీ కావడంతో ఏవో కె.రామారావు తాత్కాలిక బాధ్యతలు చేపడుతున్నారు. ● మండలంలో 3 కార్యదర్శులు, టైపిస్టు పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఈవోపీఆర్డీగా పని చేసిన అధికారి మృతితో ఆ స్థానం ఖాళీగా మారింది. ● విద్యాశాఖ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంఈవో-1గా ఉన్న ఎన్.నాగభూషణరావు సస్పెండ్ కావడంతో స్థానం ఖాళీ అయ్యింది. ఈ పోస్టులను అత్యవసరంగా భర్తీ చేయాల్సి ఉంది.

ఇన్‌ఛార్జుల పాలనలో..

జియ్యమ్మవలస పశు వైద్యాధికారి మునికుమార్ చినమేరంగిలోనూ విధులు నిర్వర్తిస్తున్నారు. రావాడలో ఓఎస్, చినమేరంగిలో వీఏఎస్, వీఏ, ఓఎస్ ఖాళీలున్నాయి. ● వెలుగు ఏపీఎంగా గతేడాది పనిచేసిన వెంకట్ వెళ్లిపోగా సీసీ నాగభూషణరావు ఇన్‌ఛార్జిగా ఉన్నారు. 8 మంది సీసీలకు ఆరుగురు మిగిలారు. ● ఐసీడీఎస్‌లో నాలుగు సెక్టార్లకు ముగ్గురు పర్యవేక్షకులున్నారు. ● వ్యవసాయశాఖలో ఏవో హర్షలత దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో జ్యోత్స్న ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. ఏఈవో, పలు చోట్ల ఏఏవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ● చినమేరంగి సీఐ బి.మంగరాజు బదిలీకాగా ఆ స్థానంలోకి ఎవరూ రాలేదు.

ఒరిగిన ఆర్టీసీ బస్సు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విజయదశమి పండగ రోజున ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. చోదకుడు చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. రాజాం నుంచి పాలకొండ వస్తున్న బస్సు శనివారం రాత్రి ఎదురుగా వచ్చిన వాహనానికి దారిచ్చే క్రమంలో పక్కనున్న గుంతలోకి జారింది. చోదకుడు బస్సు పడిపోకుండా నిలిపేయడంతో ప్రమాదం తప్పింది. రహదారి ఇరుకుగా ఉండటం, రాత్రి సమయం కావడంతో ఘటన చోటు చేసుకుంది. ఆదివారం డీఎం పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది బస్సును బయటకు తీశారు.

అమ్మవారి లడ్డూలు అధరహో

బలిజిపేట, పాలకొండ, న్యూస్‌టుడే: బలిజిపేట బస్టాండులో ఆటో కార్మికులు ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇక్కడ 21 కిలోల లడ్డూ ప్రసాదాన్ని నైవేద్యంగా పెట్టారు. వేలం పాటలో బొబ్బిలి మండలం కలవరాయికి చెందిన వి.హరికృష్ణ రూ.34 వేలుకు దక్కించుకున్నారు. ● పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలోని అమ్మవారి లడ్డూ ప్రసాదాన్ని ఉత్సవ కమిటీ పర్యవేక్షకుడు పల్లా కొండలరావు రూ.45 వేలకు వేలంలో దక్కించుకున్నారు. నిర్వాహకులు అందజేశారు.



రూ.34 వేలకు పాడిన హరికృష్ణ



రూ.45 వేలకు దక్కించుకున్న కొండలరావు

నేడు పరిష్కార వేదిక

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరగనున్నట్లు సిబ్బంది తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు హాజరై వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు అందజేయాలని సూచించారు.

సాయి పుణ్యతిథి వేడుకలు



పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని వైకేఎం కాలనీ సాయి మందిరంలో బాబా 106వ పుణ్యతిథి వేడుకలు నిర్వహించారు. బాబా సమాధిలోకి దసరా రోజు వెళ్లిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అర్చకులు విజయలక్ష్మి తెలిపారు. సమాధిని పూలు, సుగంధాలతో అలంకరించి ప్రార్థనలు చేశారు. ఉదయం, సాయంత్రం సేవకులు పార్వతీపురంలో నగర సంకీర్తన చేపట్టారు.

స్పందించారు.. ప్రాణాలు నిలిపారు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణికి అత్యవసర సమయంలో వైద్యం అందించి ప్రాణాలు నిలిపారు వైద్యులు. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. రాయిమానువలసకు చెందిన గర్భిణి జి.మిథులను ఈ నెల 3న మామిడిపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లారు. హైరిస్కు కావడంతో విజయనగరం రిఫర్ చేశారు. అంబులెన్సులో వెళ్తుండగా ఆమె సిబ్బందితో గొడవ పడింది. మళ్లీ మామిడిపల్లి తీసుకెళ్లగా తర్వాత రోజు ఉదయాన్నే ఎవరికీ చెప్పకుండా ఇంటికి వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న డీఎంహెచ్‌వో గ్రామానికి వెళ్లి పరీక్షించారు. శుక్రవారం అర్ధరాత్రి నొప్పులు రావడంతో వైద్యాధికారి శివకుమార్, సిబ్బందితో గ్రామానికి వెళ్లి ఆసుపత్రికి తీసుకొచ్చారు. రాత్రి ఒంటి గంట సమయంలో సుఖ ప్రసవమైంది. ఆమెకిది నాలుగో ప్రసవం. ఇప్పటికే మూడు సార్లు ఇంటి వద్ద ప్రసవించగా పిల్లలను కోల్పోయింది. గిరిజనులు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి శివకుమార్ కోరారు.



అర్ధరాత్రి గర్భిణి ఇంటికి వెళ్లి పరీక్షిస్తున్న వైద్యులు

సత్కారం

కురుపాం గ్రామీణం: ట్రైకార్ సభ్యురాలిగా నియామకమైన పువ్వల లావణ్యను తెదేపా రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్‌చంద్రదేవ్ ఆదివారం సత్కరించారు. కురుపాం కోటలో నాయకులతో సమావేశమై నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై చర్చించారు. నాయకులు కె.రంజిత్‌కుమార్, కొండయ్య, వంశీ తదితరులు ఉన్నారు.

డీటీకి బాధ్యతలు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: జియ్యమ్మవలస తహసీల్దారుగా పనిచేసిన డీవీ సీతారామయ్య బదిలీపై శ్రీకాకుళం జిల్లాకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆ బాధ్యతలను ఉప తహసీల్దారుగా ఉన్న కె.పకీరుకు అధికారులు అప్పగించారు.

సేవలు చిరస్మరణీయం

సాలూరు గ్రామీణం: స్వాతంత్ర్య సమర యోధుడు గొర్లెపాటి బుచ్చప్పరావు సేవలు చిరస్మరణీయమని వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి ప్రసాదరావు అన్నారు. ఆదివారం బుచ్చప్పరావు జయంతి సందర్భంగా నివాళులర్పించారు. నేటి యువతకు బుచ్చప్పరావు ఆదర్శవంతులని కొనియాడారు.

పంటలు ఎండుతున్నాయ్

పాలకొండ గ్రామీణం, పాలకొండ, న్యూస్‌టుడే: వర్షాలు ఒక్కసారిగా ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తోటపల్లి పాత ఆయకట్టు శివారు పొలాలకు సాగునీరు వెళ్లక ఎండుతున్నాయి. 10 రోజులుగా చినుకు జాడ లేక పొట్టదశలో పంట పోతుందని ఆవేదన చెందుతున్నారు. అట్టలి, తుమరాడ, పీఆర్‌రాజుపేట, వడమ, ఎన్‌కేరాజపురం, పరుశురాంపురం, సింగన్నవలస, తంపటాపల్లి, టీడీపారాపురం, బెజ్జి, టీకేరాజపురం, బుక్కూరు గ్రామాల పరిధిలో పరిస్థితి ఇలానే ఉంది. రైతులు ఇంజిన్లను వినియోగించి కాలువలు, చెరువుల నుంచి నీరు మళ్లిస్తున్నారు.



సాగు నీరు అందించేందుకు ఇంజిను సిద్ధం చేస్తున్న రైతు



నీరులేక ఎండుతున్న వరి